సాక్షి ఖమ్మం

గురువారం, 22, మే, 2025



సదస్సులు లేవు..

గతంలో మాదిరి చైతన్యయాత్రలు ఏర్పాటు చేయకపోవడంతో సాగులో మెళకువలపై రైతులకు సూచనలు అందడం లేదు. 8లో



ఆర్టిజన్లకు బదిలీ భయం

పాల్వంచలోని కేటీపీఎస్‌లో అరకొర వేతనాలతో పనిచేస్తున్న ఆర్టిజన్లను బదిలీ చేస్తారన్న ప్రచారం వారిని భయపెడుతోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 25°

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఈనెల 31లోగా ఉపకార వేతనాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ కులాల్లో అర్హత కలిగిన విద్యార్థులు ఉపకార వేతనాల(ఫ్రెష్, రెన్యువల్) కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ సూచించారు. బ్యాంక్ అకౌంట్‌ను బ్రాంచ్‌లో ఆధార్ సీడింగ్ చేసుకున్నాక ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కాగా, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీ ప్రిన్సిపాళ్లు డిజిటల్ కీతో పాటు ఈ–పాస్ లాగిన్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆతర్వాత విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులను ధ్రువీకరించి ఈ–పాస్ లాగిన్‌లోనే జిల్లా అధికారికి ఫార్వర్డ్ చేయాలని సూచించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

ఖమ్మంక్రైం: ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి 29వ తేదీ వరకు జరగనుండగా, పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని 38కేంద్రాల వద్ద ఉదయం 8నుంచి సాయంత్రం 6–30 గంటల వరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, ఈనేపథ్యాన కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండొద్దని సూచించారు. అలాగే, సభలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులకు అనుమతి ఉండదని తెలిపారు. కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సీపీ సూచించారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెంచాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

ఖమ్మంరూరల్: త్వరలో మొదలుకానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ఎస్.సత్యనారాయణ సూచించారు. రూరల్ మండలం ఏదులాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన శిక్షణను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల చేరిక శాతాన్ని నిలకడగా కొనసాగేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రవేశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం పెరిగేలా బోధనలో మార్పులను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంఈఓ శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీపీ జితేందర్

ఖమ్మంక్రైం: గత ఏడాది డిసెంబర్‌లో నేలకొండపల్లి మండలంలో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసును ఛేదించడంలో కీలంగా వ్యవహరించిన పోలీసులకు ప్రశంసలు దక్కాయి. ఈ సందర్భంగా కూసుమంచి సీఐ టి.సంజీవ్, నేలకొండపల్లి కానిస్టేబుల్ ఎం.నాగరాజును డీజీపీ జితేందర్ అభినందించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యాలయంలో వారికి డీజీపీ ప్రశంసాపత్రాలు అందించగా, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వారిని అభినందించారు.

లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్



ఖమ్మం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో డిఫెన్స్ కౌన్సిల్ ఉద్యోగాలకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు అర్హులైన న్యాయవాదులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఒక ప్రకటనలో సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా స్పీడ్ పోస్ట్ లేదా వ్యక్తిగతంగానైనా న్యాయ సేవాధికార సంస్థలో తమ దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

హమ్మయ్య.. చల్లబడింది



ఖానాపురం చెరువుపై కమ్ముకున్న కారుమబ్బులు



వర్షంలో తడుస్తూ వెళ్తున్న వాహనదారులు



ఇన్నాళ్లు ఎండలు మండిపోతుండగా.. బుధవారం జిల్లాలో కురిసిన జల్లులు ప్రజలకు ఉపశమనం కలిగించాయి. ఓ వైపు నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయన్న సమాచారానికి తోడు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో మబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడగా ప్రజలు సేదతీరారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

బడ్డీ.. బుడిబుడిగానే

యాప్‌ల్లో కానరాని మున్సిపాలిటీల వివరాలు

- పాతవి అప్‌డేట్ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- అప్‌డేట్, అవగాహనలో వెనుకబాటు
- కేఎంసీ మినహా అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి





సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రవిబాబు విధులు నిర్వర్తిస్తున్నట్లుగా ఫొటోతో సహా సిటిజన్ బడ్డీ యాప్‌లో కనిపిస్తోంది. కానీ ఇక్కడ కమిషనర్‌గా కె.నర్సింహ విధుల్లో చేరి రెండు నెలలు దాటింది. ఇదొక్కటే కాక మిగతా మున్సిపాలిటీల వివరాలూ అప్‌డేట్ కాకపోగా.. నెలల క్రితమే గడువు ముగిసిన పాలకవర్గాల వివరాలు కూడా తొలగించకపోవడం గమనార్హం.

అందరి చేతిలో ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన సెల్‌ఫోన్లు ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీల పరిధిలో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, సమాచారం చేరవేసేందుకు గాను ప్రభుత్వం సిటిజన్ బడ్డీ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఏ సమస్యపై అయినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముండగా, అనుమతుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాక ఫిర్యాదుల స్థితిగతులను ఎప్పటికప్పుడు చూడొచ్చు. కానీ ఈ యాప్ నిర్వహణ, వివరాల అప్‌డేట్‌తో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంలో జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులు నిర్లిప్తత కనబరుస్తున్నారు. – సత్తుపల్లి

కమిషనర్‌తో పాటు సీడీఎంఏకు...

సిటిజన్ బడ్డీ యాప్ ద్వారా మున్సిపాలిటీల పరిధిలో అనుమతి కోసం దరఖాస్తులు, సమస్యలపై ఫిర్యాదు చేయగానే సమాచారం సంబంధిత కమిషనర్‌తో పాటు సీడీఎంఏ(హైదరాబాద్)కు వెళ్తుంది. తద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 2019లో ప్రవేశపెట్టిన ఈ యాప్ ద్వారా అన్ని వివరాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించే వీలుండడంతో మున్సిపాలిటీల అధికారులు పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తారనే నమ్మకం కలిగేది. కానీ జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మినహాయిస్తే పాత మున్సిపాలిటీలైన సత్తుపల్లి, మధిర, వైరాతో పాటు కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ వివరాల కోసం ఆరా తీస్తే పాత వివరాలే దర్శనమిస్తుండడం గమనార్హం. యాప్‌లో అప్‌డేట్ చేయడం, ఉపయోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అయినా నిర్లక్ష్యం కనబరుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో యాప్ ఉన్న విషయం చాలా మందికి తెలియకపోగా... చిన్నాపెద్ద సమస్య ఏదైనా మున్సిపల్ కార్యాలయాలకు వ్యయప్రయాసలకోర్చి రావాల్సి వస్తోంది. అక్కడ లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు, దరఖాస్తులు ఇచ్చినా ఎప్పటికి పరిష్కరిస్తారో స్పష్టత ఉండడం లేదు. ఇదే సమయాన పౌరసేవ పత్రం ఆధారంగా సమయం ప్రకారం సమస్యలు పరిష్కరించకపోగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏ ఉద్యోగిపైనా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు.

పాలకవర్గాలు లేకున్నా.. కమిషనర్లు మారినా...

జిల్లాలోని మున్సిపాలిటీ సమాచారం ఏ మేరకు అప్‌డేట్ చేశారోనని సిటిజన్ బడ్డీ యాప్‌లో పరిశీలిస్తే అన్నీ పాత వివరాలే కనిపిస్తున్నాయి. ఏడాది క్రితం వరకు అప్పుడప్పుడు కొందరు పలు విభాగాలపై ఫిర్యాదులు చేశారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చినా కొన్ని పరిష్కరించినట్లు, మరికొన్ని తిరస్కరించినట్లు అందులో పేర్కొన్నారు. ఇక సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసి నెలలు గడిచినా యాప్‌లో ఇంకా చైర్మన్, వైస్ చైర్మన్ల పేర్లు అలాగే ఉన్నాయి. ఇది పక్కన పెడితే సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా విధుల్లోకి చేరి రెండు నెలలు కావొస్తున్నా గతంలో పనిచేసిన రవిబాబు పేరు ఫొటో సహా ఉంది. వైరా కమిషనర్‌గా చింతా వేణు విధులు నిర్వర్తిస్తుండగా గతంలో పనిచేసిన ఎస్.వెంకటపతి రాజు పేరు, ఫొటో తొలగించలేదు. మధిర మున్సిపాలిటీకి సంబంధించి కమిషనర్ ఎవరు పనిచేస్తున్నారో అసలు అప్‌డేటే చేయలేదు. కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ వివరాలు ఏవీ కూడా యాప్‌లో పొందుపర్చలేదు. కేవలం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ వివరాలు అన్నీ సక్రమంగా ఉండడం విశేషం.

వాట్సాప్‌కు పంపిస్తున్నారు..



చాలా మంది సమస్యలను వాట్సాప్‌కు పంపిస్తుండడంతో వెంటనే పరిష్కరిస్తున్నాం. సిటిజన్ బడ్డీ యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఫిర్యాదులు, దరఖాస్తులు నమోదు చేసేలా చూస్తాం. మా ఉద్యోగుల ఫోన్లలోనూ యాప్ డౌన్‌లోడ్ చేయించి ఫిర్యాదుల పరిశీలనకు ఆదేశాలు ఇస్తాం. అలాగే, యాప్‌లో వివరాలు కూడా అప్‌డేట్ చేస్తాం.

– కె.నర్సింహ, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

NEW ERA
NEW LITTLE FLOWER
SENIOR SECONDARY SCHOOL
IIT JEE & MEDICAL ACADEMY A/C
CBSE & STATE CURRICULAM
DAY & RESIDENTIAL
Wyra, KHAMMAM.
Ph : 888 622 0477, 82970 99952

తొలకరి పలకరింపు

- రుతుపవనాల ముందస్తు ప్రభావం
- దుక్కులు, పచ్చిరొట్ట సాగుకు అనువైన వాతావరణం
- సన్నాహాల్లో నిమగ్నమైన అన్నదాతలు

ఖమ్మంవ్యవసాయం: తొలకరికి వేళయింది. సాధారణంగా జూన్ 1నాటికి కేరళను తాకే నైరుతి రుతుపవనాలు 6, 7వ తేదీకల్లా తెలుగు రాష్ట్రాలపై ప్రభావం చూపిస్తాయి. కానీ ఈసారి ముందుగానే రుతుపవనాలు రానున్నాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యాన.. ఆ ప్రభావం అప్పుడే మొదలైంది. దీంతో బుధవారం వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈనెల రెండో వారం వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మూడో వారం నుంచి తగ్గుముఖం పట్టాయి. 40–45 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 32–37 డిగ్రీలకే పరిమితమవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా, మధ్యాహ్నం 12గంటల తర్వాత నుంచి జిల్లావ్యాప్తంగా జల్లులు మొదలయ్యాయి. బాణాపురంలో 20.3 మి.మీ.ల వరపాతం నమోదు కాగా, ఖమ్మం ఖానాపురంలో 16.3, కూసుమంచిలో 15.3, వైరా ఏఆర్ఎస్ వద్ద 8.8, ముదిగొండ, మధిరలలో 7.5, నాగులవంచలో 6.8, చింతకానిలో 6.3, మధిర ఏఆర్ఎస్ వద్ద 5.5, బచ్చోడు, తిరుమలాయపాలెంలో 5 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

సాగుకు అన్నదాతలు సమాయత్తం

గత నెల, ఈనెల కురిసిన అకాల వర్షాలతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. యాసంగిలో సాగు చేసిన పత్తి, మిరప వ్యర్థాలను తొలగించి వర్షాలు అదునుగా ఉన్న చోట దుక్కులు దున్నుతున్నారు. ఇక జిల్లాలో ప్రధాన పంటలైన వరి 2.95 లక్షల ఎకరాలు, పత్తి 2.13 లక్షల ఎకరాలు, మిరప 71 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేసిన అధికారులు అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు సమకూర్చడంపై దృష్టి సారించారు. ముందుగా పత్తి విత్తనాలు అందుబాటులోకి తీసుకొస్తుండగా, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సైతం పెసర, మినుము, కంది వంటి విత్తనాలను సిద్ధం చేయడంలో నిమగ్నమైంది.

ఇదే అదును

ప్రస్తుత వాతావరణం దుక్కులు చేసుకోవడంతో పాటు పచ్చిరొట్ట విత్తనాలు వేసేందుకు అనుకూలిస్తుందని అధికారులు చెబుతున్నారు. మాగాణి భూముల్లో పిల్లి పెసర, జీలుగు వేసుకుని భూసారాన్ని పెంచుకోవచ్చు. విత్తనాభివృద్ధి సంస్థ 50 శాతం సబ్సిడీపై జీలుగు, జనుము పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే, మిరప సాగు భూముల్లో పెసర పంట సాగుకు ప్రస్తుతం అనువుగా ఉందని చెబుతున్నారు. దీంతో రైతులు విత్తనాలు సమకూర్చుకోవడంపై దృష్టిసారించారు.

వ్యవసాయ పనులకు అనువుగా..



నైరుతి రుతుపవనాల ముందస్తు ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై వర్షాలు కూడా కురుస్తున్నాయి. ఇప్పుడు పంటల సాగుకు అనుకూలంగా దుక్కులు చేసుకోవచ్చు. పచ్చి రొట్ట విత్తనాలను వేసుకోవచ్చు. 60 – 70 మి.మీ.ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలు వేసేందుకు అనువుగా ఉంటుంది.

– డాక్టర్ రవికుమార్, కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, వైరా

భూసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రైతులంతా సహకరిస్తే త్వరగా ప్రక్రియ పూర్తి
- ములుగుమాడు సదస్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఎర్రుపాలెం : భూసర్వే సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్

ఎర్రుపాలెం: భూముల సమగ్ర సర్వే ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఎర్రుపాలెం మండలం ములుగుమాడు రెవెన్యూ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందున రైతులు సహకరించాలని సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను బుధవారం కలెక్టర్ తనిఖీ చేయడంతో పాటు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సదస్సులో మాట్లాడారు. 1930లో భూ సర్వే జరగగా, ఇప్పుడు భూభారతి చట్టం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు సర్వే మ్యాప్ జత చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయిస్తున్నామని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేశాక, నివేదికలను గ్రామంలో ప్రదర్శిస్తామని.. ఆపై అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరించాక శాశ్వత గ్రామ భూరికార్డు రూపొందిస్తామని కలెక్టర్ వివరించారు. తద్వారా నక్షా సిద్ధమవుతుందని, భూములు కుంటల్లోకి మారి కచ్చితమైన సరిహద్దులు వెల్లడవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఏడీ సర్వే శ్రీనివాసులు, ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ రాజశేఖర్ తదితరులున్నారు.

ఆడపిల్లే ఇంటికి మహాలక్ష్మి



వైరా రూరల్ : చంటి బిడ్డను లాలిస్తున్న కలెక్టర్

వైరారూరల్: ఆడపిల్ల పుడితే భారంగా కాకుండా ఇంటికి మహాలక్ష్మి వచ్చినట్లు భావించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. వైరా మండలం రెబ్బవరంలో గుత్తా ఉషారాణి – సాయిప్రణీత్ దంపతులు ఇటీవల ఆడపిల్లకు జన్మనివ్వగా 'మా పాప – మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా వారిని కలెక్టర్ సన్మానించి సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు అన్నిరంగాల్లో అబ్బాయిలతో సమానంగా ఎదుగుతున్న నేపథ్యాన సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, వైరా తహసీల్దార్ కే.వీ.శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.సరస్వతి, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం.. కాషాయవర్ణం

- నేడు హనుమజ్జయంతి.. భద్రగిరికి బారులుదీరిన మాలధారులు
- శ్రీరామనవమి తరహాలో భక్తులు వస్తున్నా అరకొర ఏర్పాట్లతోనే సరి



రామయ్య దర్శనానికి క్యూలో ఉన్న మాలధారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జై శ్రీరామ్ నామస్మరణలతో మార్మోగే భద్రగిరి వీధుల్లో ఇప్పుడు 'రామభక్త హనుమాన్‌కీ జై' నినాదాలు వినిపిస్తున్నాయి. హనుమాన్ జయంతిని గురువారం జరుపుకోనుండగా, తెలుగు రాష్ట్రాల్లో ఆంజనేయస్వామి మాల ధరించిన భక్తులు భద్రాచలం చేరుతున్నారు. దీంతో పట్టణం, ఆలయ ప్రాంగణం, గోదావరి తీరం కాషాయవర్ణాన్ని సంతరించుకున్నాయి.

దశాబ్ద కాలంగా..

భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం వందల ఏళ్లుగా అంగరంగ వైభవంగా సాగుతోంది. అలాగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, ఆ ముందురోజు తెప్పోత్సవం సైతం కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు భద్రాచలం వస్తుండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. అయితే దశాబ్ద కాలంగా హనుమాన్ జయంతి సందర్భంగా కూడా భక్తుల తాకిడి పెరుగుతోంది.

అంజన్న భక్తులకు సవాలే..

శ్రీరామనవమి, ముక్కోటి పండుగల తరహాలోనే హనుమాన్ జయంతికి కూడా వేలాదిగా భక్తులు వస్తున్నా ఆ స్థాయిలో ఏర్పాట్లులేక ఇబ్బంది పడుతున్నారు. మాల ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా వచ్చే భక్తులకు సవాల్ ఎదురవుతోంది.

ప్రణాళిక అవసరం..

వేలాదిగా భక్తులు వచ్చే హనుమాన్ జయంతి పర్వదినం రోజున ప్రత్యేక ఏర్పాట్లపై అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. అదనపు క్యూ లైన్లు, ప్రసాదం కౌంటర్లతోనే సరిపెడుతుండగా ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మాల విరమణ కోసం భద్రాచలం వచ్చే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్నందున శబరిమల తరహాలో ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది. ఆలయంతో పాటు జిల్లా అధికారులు ఈ విషయమై దృష్టి సారించి భక్తులు ఇబ్బంది పడకుండా డార్మిటరీలు, తాగునీరు వంటి అదనపు సౌకర్యాలు, మాల విరమణకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు, భజన మందిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే, శ్రీరామ నవమి తరహాలోనే ఈ ఏర్పాట్లపై మంత్రుల స్థాయిలో సమీక్ష జరపాలనే సూచనలు వస్తున్నాయి.

ఆ సొమ్ము రికవరీ ఎలా?

- మెప్మాలో పలువురు ఆర్పీల చేతివాటం
- సంఘాలు లేకుండానే రుణాల డ్రా
- పత్రాలు చూడకుండానే మంజూరుపై అనుమానాలు



ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాలను అడ్డుపెట్టుకుని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మెప్మాలోని కొందరు రిసోర్స్ పర్సన్లు(ఆర్పీలు) బ్యాంకుల నుండి రుణాల పేరిట రూ.లక్షల్లో కొల్లగొట్టారు. మెప్మా అధికారుల అలసత్వం.. బ్యాంకర్ల నిర్లక్ష్యంతో లింకేజీ రుణాలను ఆర్పీలు సులువుగా తీసుకుని వెనకేసుకున్నారు. మహిళలకు తెలియకుండానే సదరు ఆర్పీలు సంఘాలను ఏర్పాటు చేసి, రుణాలు తీసుకోవడంతో వాటి రికవరీ బ్యాంకర్లకు తలనొప్పిగా మారింది. మూడేళ్ల నుంచి మహిళలకు నోటీసులు జారీ చేస్తున్నా తిరుగు సమాధానం లేకపోవడం, నోటీసులు అందుకున్న కొందరు అసలు తాము రుణాలే తీసుకోలేదని ఎదురుతిరగడంతో ఆర్పీల మోసం బయటపడింది. అయితే, రుణాలు కాజేసిన ఆర్పీలను మెప్మా అధికారులు తొలగించినప్పటికీ వారు తీసుకున్న సొమ్ము ఎలా రికవరీ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రెండు బ్యాంకుల నుండే..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని మహిళా సంఘాలకు పలు బ్యాంకుల నుండి లింకేజీ రుణాలు ఇస్తుంటారు. అయితే ఇద్దరు ఆర్పీలు అటు మహిళలు, ఇటు బ్యాంకర్లను మోసం చేసి కేవలం రెండు ప్రైవేట్ బ్యాంకుల నుంచే రుణాలు తీసుకున్నారని తెలుస్తోంది. ఓ బ్యాంక్‌లో ఎనిమిది, మరో బ్యాంకులో ఆరు సంఘాల పేరిట ఒక్కో సంఘం తరఫున రూ.15 లక్షల వరకు రుణాలు డ్రా చేసినట్లు తెలిసింది. ఈ సమయంలో బ్యాంకర్లు డాక్యుమెంట్లు సక్రమంగా చూడకుండానే రుణాలు మంజూరు చేయడం గమనార్హం. కోవిడ్ కాలం 2021లో ఈ రుణాలను బ్యాంకర్లు మంజూరు చేయగా.. నాటి నుండి రికవరీ కోసం మహిళలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కానీ రుణాలతో సంబంధం లేని తమకు నోటీసులు రావడంతో పలువురు మహిళలు మెప్మా అధికారులు, బ్యాంకర్లను కలవగా గతేడాది ఆర్పీలను తొలగించినప్పటికీ రికవరీ మాత్రం మొదలుకాలేదు.

మరోసారి నోటీసులు

పలువురు మహిళలకు తీసుకున్న రుణాలు చెల్లించాలని ఇటీవల బ్యాంకర్లు మరోసారి నోటీసులు ఇవ్వడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మెప్మా అధికారులు పట్టించుకోకపోడవంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తమ ప్రమేయం లేకుండా తప్పుడు పత్రాలతో రుణాలు కాజేసిన ఆర్పీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో పోలీసులు ఓ ఆర్పీని తీసుకురావడంతో పెద్దల మధ్య పంచాయితీ పెట్టారని కేఎంసీలో చర్చ జరుగుతోంది.

అసలు ఎలా సాధ్యమైంది?

మహిళా సంఘాల సభ్యులను చూడకుండా, వారితో సంతకాలు చేయించకుండా ఏ బ్యాంకు రుణాలను మంజూరు చేయదు. అలాంటిది రెండు ప్రైవేట్ బ్యాంకుల ద్వారా ఆర్పీలు ఎలా రుణాలు తీసుకున్నారనే ప్రశ్నకు సమాధానం తెలియడం లేదు. రెండేళ్లుగా ఈ మోసంపై చర్చ జరుగుతున్నా సమస్య మూలాలపై బ్యాంకర్లు, మెప్మా అధికారులు వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. ఆర్పీలు, బ్యాంకర్లకు ఉన్న సత్సంబంధాలతోనే రుణాలను కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం రెండు బ్యాంకుల్లోనే ఇలా జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రికవరీ అయ్యేనా..

రుణం చెల్లించాలని బ్యాంకర్లు 140మంది మహిళలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఇందులో కొందరికి పంపిన నోటీసులు తిరిగి వస్తుండగా.. మరికొందరు మాత్రం తీసుకుని తమకేం సంబంధం లేదని అధికారుల ఎదుట వాపోతున్నారు. ఇంకొందరికి జారీ చేసే నోటీసులు తిరిగి వస్తుండడంతో తప్పుడు చిరునామాలు పొందుపర్చినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకు కారణాలు, బాధ్యులు ఎవరైనప్పటికీ రుణ నగదును రికవరీ ఎలా చేస్తారన్న ప్రశ్నకు సమాధానం మాత్రం ఏళ్లు గడుస్తున్నా లభించడం లేదు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 5గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ముత్తగూడెంలో రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం ఎంపీపీఎస్‌లో అదనపు తరగతిగదుల నిర్మాణానికి, పాన్నెకల్ నుండి పిట్టలవారిగూడెం వయా ఆరెంపుల రోడ్డుకు, కాచిరాజుగూడెంలో చింతపల్లి – కాచిరాజుగూడెం రోడ్డు మరమ్మత్తులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

జాబ్ మేళా స్థల పరిశీలన



మైదానంలో పరిశీలిస్తున్న ఏసీపీ, తదితరులు

వైరా: ఈనెల 24న వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింగరేణి సంస్థ ఆధ్వర్యాన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈమేరకు కళాశాల మైదానాన్ని బుధవారం వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్ పరిశీలించారు. జాబ్‌మేళాకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరుకానుండగా, పెద్దసంఖ్యలో నిరుద్యోగులు పాల్గొనే అవకాశమున్నందున పార్కింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సీఐ సాగర్, ఎస్ఐ రామారావు, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, నాయకులు ఏదునూరి సీతారాములు పాల్గొన్నారు.

ఇకనైనా నరమేధాన్ని ఆపాలి

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రత్యేక బలగాలు మావోయిస్టు పార్టీ నేతలు, గెరిల్లా దళ సభ్యులు 80 మందిని ఎన్‌కౌంటర్ చేశాయని.. ఇకనైనా ఈ నరమేధాన్ని ఆపాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో 500 మందిని హతమార్చగా, ఇందులో అమాయకులు, సాధారణ ఆదివాసీలు కూడా ఉన్నారని తెలిపారు. దేశ పౌరులు, ప్రజల తరపునర నిలబడే వారిపై అంతర్గత యుద్ధం చేయడం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం ఒక విధానంగా చేస్తోందని ఆరోపించారు. కాగా, ఎన్‌కౌంటర్ హత్యలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని న్యాయవిచారణ చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.


108 అంబులెన్స్‌లో ప్రసవం



బాలింత స్రవంతితో సిబ్బంది


మధిర: నిండు గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మధ్యలోనే ప్రసవించింది. మధిర మండలం మహాదేవపురానికి చెందిన పి.స్రవంతి(23)కి బుధవారం ఉదయం పురిటి నొప్పులు వస్తుండడంతో మధిర ఆస్పత్రికి తీసుకెళ్లగా ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో 108 ద్వారా ఖమ్మం తీసుకెళ్తుండగా బోనకల్ సమీపాన నొప్పులు ఎక్కువవడంతో ఆశ వర్కర్ సాయంతో ఈఎంటీ రామయ్య ఆమెకు ప్రసవం చేశారు. ఈక్రమంలో స్రవంతి ఆడపిల్లకు జన్మనివ్వగా, తల్లీబిడ్డలను మధిర ఆస్పత్రిలో చేర్చారు.

'యంగ్ ఇండియా' స్కూల్ స్థల పరిశీలన



స్థల వివరాలు ఆరా తీస్తున్న ఆర్డీఓ

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని చెన్నూరులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు సేకరించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను చెన్నూరులో నిర్మించేందుకు స్థలాన్ని గుర్తించారు. ఈ భూమిని కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ భూమికి ఇప్పటికే హద్దులు నిర్ధారించగా, మ్యాప్‌లను పరిశీలించి పూర్తి వివరాలు ఆరా తీశారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, ఆర్ఐలు సుజాత, ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,058

సదస్సులు లేవు.. చైతన్యం లేదు..

- ఊసే లేని 'మన తెలంగాణ – మన వ్యవసాయం'
- రెండేళ్ల క్రితం వరకు ఏప్రిల్, మే నెలల్లో అవగాహన సదస్సులు
- ఈసారి మండలానికొక సదస్సుతో సరి



ట్రాక్టర్‌తో పొలం దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

వైరారూరల్: పంటల సాగులో అవలంబించాల్సిన విధానాలు, విత్తనాల ఎంపిక జాగ్రత్తలు, సాగుకు ముందు చేయించాల్సిన భూపరీక్షలు ఇలా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు రైతు చైతన్య యాత్రలు నిర్వహించేవారు. తెలంగాణ ఏర్పడాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'మన తెలంగాణ – మన వ్యవసాయం' పేరుతో రైతు సమన్వయ సమితి సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఏటా వానాకాలం సాగుకు ముందు ఏప్రిల్, మే నెలల్లో అవగాహన సదస్సులను నిర్వహించేది. కానీ గత రెండేళ్ల నుండి 'మన తెలంగాణ – మన వ్యవసాయం' ఏటా సదస్సుల ఊసెత్తడం లేదు. దీంతోఆధునిక విధానాలపై అవగాహన లేక, ఏళ్లుగా ఒకే పంట సాగు చేస్తూ, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతూ రైతులు నష్టపోవడం అనవాయితీగా మారింది.

అవగాహనలేమితో నష్టాలు

గ్రామాల వారీగా రైతుల వద్దకు వెళ్లి సాగులో మెళకువలపై అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అంతేకాక నష్టాలు తగ్గే అవకాశముంది. గతంలో సదస్సులు నిర్వహించినప్పుడు వ్యవసాయ అధికారుల బృందం ఉదయం 7గంటలకల్లా గ్రామాలకు వెళ్లి వివిధ అంశాలపై అవగాహన కల్పించడమే కాక రైతుల నుంచి సంతకాలు సేకరించేవారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు సమన్వయ సమితిల జాడ లేకపోగా, అవగాహన సదస్సుల విషయాన్నే మరిచిపోయారు. ఈ ఏడాది 'రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' పేరిట ససదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ నిర్దేశిత ప్రాంతాల్లోనే ఏర్పాటుచేస్తుండడంతో రైతులకు సలహాలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవగాహన కల్పించాలి..



రైతు చైతన్య యాత్రలు నిర్వహించకపోవడంతో అన్నదాతలకు అవగాహన లేక నష్టపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చైతన్య సదస్సులు ఏర్పాటుచేయాలి. సేంద్రియ వ్యవసాయంపైనా అవగాహన కల్పిస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– యమాల గోపాలరావు, సీపీఐ నాయకుడు

అమలు చేయాలి..



సాగుకు ముందు పంటలు, విత్తనాల రకాలపై అవగాహన లేకుండా పోయింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి గతంలో మాదిరి చైతన్యయాత్రలు నిర్వహించి భూసార పరీక్షలు, ఇతర అంశాలపై వివరించాలి. దీంతో రైతులకు మేలు జరుగుతుంది.

– అయినాల కనకరత్నం, రైతు, కేజీ సిరిపురం

ఆర్టిజన్లకు బదిలీల భయం

- కేటీపీఎస్‌లో అరకొర వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు
- పర్మనెంట్ చేశాకే బదిలీ చేయాలని డిమాండ్



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు బదిలీల భయం పట్టుకుంది. ఇప్పటికే టీజీ జెన్‌కో పరిధిలోని పలు కర్మాగారాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాలతోపాటు, ఏఈ నుంచి ఎస్ఈ వరకు బదిలీలు జరిగాయి. కొత్తగా ఏర్పాటైన వైటీపీఎస్, బీటీపీఎస్‌లలో ఉద్యోగ, కార్మికులు అవసరం ఉండటంతో అక్కడికే ఎక్కువ మందిని బదిలీలు చేశారు. ఈ క్రమంలో కేటీపీఎస్‌లో అదనంగా ఉన్న ఆర్టిజన్లకు సైతం స్థానచలనం కలిగించాలని యాజమాన్యం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

బదిలీలు సరికాదంటున్న కార్మికులు

ఆర్టిజన్ కార్మికులు గ్రేడ్–1, 2 ,3, 4లుగా ఉన్నారు. స్కిల్ ఆధారంగా రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. వీరు గతంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేసిన క్రమంలో స్కిల్‌ను బట్టి ఆయా కంపెనీలు పనికి తగిన వేతనం ఇచ్చేవి. గత ప్రభుత్వం వీరిని ఆర్టిజన్‌లుగా తీసుకోవడం, కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. తర్వాత కాలంలో పర్మనెంట్ ఉద్యోగులుగా తీసుకుంటారనే ఆశలో ఆర్టిజన్లు ఉన్నారు. కానీ పదేళ్లు గడుస్తున్నా ఉద్యోగుల మాదిరిగా వీరికి జెన్‌కో యాజమాన్యం సౌకర్యాలు కల్పించడంలేదు. పైగా అదనంగా ఉన్నారనే నెపంతో యాజమాన్యం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలనే యోచన సరికాదనే భావన వ్యక్తమవుతోంది. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నామని ఆర్టిజన్లు వాపోతున్నారు.

ఉద్యోగులుగా తీసుకోవాలి

ఇప్పటివరకు ఇతర కేడర్లలో అత్యధికంగా పదోన్నతులతోనే బదిలీలు చేపట్టారు. ఆర్టిజన్లు కేటీపీఎస్ 7వ దశలో 600 మంది, కేటీపీఎస్ 5,6 దశల్లో సుమారు 1,400 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. విద్యుత్ సంస్థలన్నింటిలో కలిపి సుమారు 24 వేల మంది ఉన్నారు. బదిలీ చేసే ముందు తమను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలన్నీ తమకు కల్పించాలని ఆర్టిజన్లు కోరుతున్నారు. లేనిపక్షంలో బదిలీ యోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే డీలర్లపై పీడీ యాక్ట్

జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



కొణిజర్ల : డీలర్లకు పీఓఎస్ మిషన్లు అందజేస్తున్న డీఏఓ, అధికారులు

కొణిజర్ల/కూసుమంచి: పత్తి సహా అన్ని పంటల విత్తనాలను అమ్మే డీలర్లు చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఏ మాత్రం పొరపాట్లకు తావిచ్చినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. కొణిజర్ల మండలం తనికెళ్ల రైతు వేదికలో వైరా డివిజన్ పరిధి డీలర్లకు, కూసుమంచి రైతు వేదికలో పాలేరు డివిజన్ డీలర్లకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన పీఓఎస్ మిషన్లు అందజేశాక మాట్లాడారు. వానాకాలం సీజన్‌కు సరిపడా పత్తి విత్తనాలు సిద్ధంగా ఉన్నందున, అమ్మే సమయాన బిల్లుపై అన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే, ఏరోజుకారోజు స్టాకు వివరాలను బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. ధరల్లో వ్యత్యాసం వచ్చినా, రైతులు కోరినవి కాకుండా ఇతర కంపెనీల విత్తనాలు అమ్మాలని యత్నించినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏడీఏలు వాసవీరాణి, టి.కరుణశ్రీ, సరిత, ఎస్సైలు జగదీష్, దివ్య, ఏఓలు బాలాజీ, నరసింహారావు, అశోక్, మంజుఖాన్, అనిల్‌కుమార్, పవన్, వాణి, సీతారాంరెడ్డి, రాధా, ఉమానగేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలకు ఆద్యుడు.. రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ అనేక సంస్కరణలకు నాంది పలికారని, భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన నిలిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనీ కుమార్, కుమార్, కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్, సంతోష్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, రాపర్తి శరత్, మదూరి ప్రసాద్, కన్నం వైష్ణవి, ప్రసన్నక్రిష్ణ, రమేష్, నాగరాజు, నరేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.12లక్షల విలువైన గంజాయి సీజ్

ఖమ్మంక్రైం: జిల్లా మీదుగా తరలిస్తున్న రూ.12లక్షల విలువైన గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుండి పూణేకు గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఖమ్మం బైపాస్ రోడ్డులో బుధవారం చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితులను పూణేకు చెందిన ఫిరోజ్ అజీజ్, ప్రదీప్ గైక్వాడ్‌గా గుర్తించగా, 20.735 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్, ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ కృష్ణ, ఎస్సైలు రేష్మ, శ్రీహరిరావు, ఉద్యోగులు కరీం, స్వరూప, సుధీర్, వెంకట్, హరీష్, హనుమత్, విజయ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఉపేందర్ పాల్గొన్నారు. కాగా, వీరిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌గౌడ్ అభినందించారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కేసులు

కారేపల్లి: గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా కేసులు నమోదు చేస్తామని కారేపల్లి ఎంపీడీఓ సురేందర్, కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దయామణి హెచ్చరించారు. కారేపల్లి మండలం ఈట్యాతండాలో కిషోర బాలికల గృహాలను సందర్శించినవారు బాల్యవివాహాలతో ఎదురయ్యే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలికలకు యుక్త వయసు వచ్చాకే వివాహం జరిపించాలని, తద్వారా ఆరోగ్య సమస్యలు ఎదురుకావని చెప్పారు. అలాకాదని ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే ఇరుపక్షాల పెద్దలతో పాటు వరుడిపైనా కేసులు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు ఎం.రమణ, వెంకటసింగ్, బి.నగ్మా, బి.శారద, బిందు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు

రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన అంకంపాలెం విద్యార్థినులు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

దమ్మపేట: పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన దమ్మపేట మండలానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ధనసరి సీతక్క, శాఖ కార్యదర్శి శరత్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కొమురం భీమ్ భవన్‌లో గిరి జన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అకాడమిక్ సక్సెస్ మీట్(2024–25)ను ఘనంగా నిర్వహించారు. 575, 569 మార్కులతో గిరిజన ఆశ్రమ పాఠశాల పరిధిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వాడే మౌనిక, స్రవంతిలకు గోల్డ్ మెడల్లను అందజేశారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలను కూడా మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించారు. ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్‌ఎంలు శారద, చంద్రకళ, వార్డెన్ నాగమణి పాల్గొన్నారు.

రైతు ఖాతా నుంచి రూ.27వేలు స్వాహా

రఘునాథపాలెం: వాట్సప్‌కు వచ్చిన ఏపీకే ఫైల్ ఓపెన్ చేయడంతో రైతు బ్యాంకు ఖాతా నుంచి రూ.27,600 మాయమైన ఘటన ఇది. మండలంలోని కొర్ర తండాకు చెందిన ఓ రైతు ఈనెల 12న తన వాట్సాప్‌కు వచ్చిన ఏపీకేఫైల్ ఓపెన్ చేశాడు. ఆ కాసేపటికి ఖాతానుంచి రూ.27,600 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ అందింది. దీంతో అప్రమత్తమైన రైతు 1930 నంబర్‌కు ఫోన్ చేయగా ఆ మొత్తాన్ని హోల్డ్‌లో పెట్టారు. అనంతరం బాధితుడు బుధవారం చేసిన ఫిర్యాదుతో సైబర్ క్రైం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు Mrs. Shriram Finance Ltd. ...

రాయపూడి శ్రీనివాసరావు
తేది.21-05-2025



పుష్పవిలాసం !

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు 'సిటీ బ్యూటిఫికేషన్' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. రహదారుల్లో డివైడర్ల నడుమ వివిధ రకాల పూల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే ఆ స్థానంలో వెంటనే కొత్తవి నాటుతున్నారు. దీంతో అవి పూలు పూస్తుండగా రహదారులకు శోభ సంతరించుకుంటోంది.

– ఖమ్మంమయూరిసెంటర్

అన్నం వండలేదని మద్యం మత్తులో భర్త దాడి

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నేలకొండపల్లి: మద్యం మత్తులో ఇంటికి వచ్చేసరికి అన్నం వండలేదని ఆగ్రహిస్తూ మహిళపై ఆమె భర్త దాడి చేయగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీలు 20మంది నేలకొండపల్లి శివారు పవర్ మెక్ కంపెనీలో పనిచేస్తూ అక్కడే షెడ్లలో నివాసముంటున్నారు. ఇందులో కుమార్ సిద్దార్థ్ – లక్ష్మి కూడా ఉండగా, ఆదివారం లక్ష్మి అన్నం వండలేదంటూ మద్యం మత్తులో ఉన్న కుమార్ ఘర్షణ పడి బలంగా కొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా చికిత్స అనంతరం నివాసానికి తీసుకొచ్చారు. కాగా, కంపెనీ సూపర్‌వైజర్ వారికి అన్నం అందించేందుకు బుధవారం షెడ్ వద్దకు రాగా ఎంత పిలిచినా పలకకపోవడంతో స్పృహ కోల్పోయినఆమెను మిగతా వారి సహకారంతో ఆస్పత్రికితీసుకెళ్లేలోగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యం మత్తులో నెట్టడంతో కింద పడగా గాయాలయ్యాయని, ఆతర్వాత ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చాక మృతి చెందిందని అంగీకరించాడు.

కర్ణాటకలో చోరీ.. వైరాలో రికవరీ



కారు, బంగారాన్ని అప్పగిస్తున్న సీఐ సాగర్

వైరా: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన చోరీకి సంబంధించి నిందితుడు వైరాలో పట్టుబడగా సొత్తు రికవరీ చేసి అక్కడి పోలీసులకు అప్పగించారు. ఈఏడాది ఫిబ్రవరి 12వ తేదీన వైరా లీలా సుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇక్కడ దొంగతనం చేసిన వారే అదే నెల 22 తేదీన కర్ణాటక రాష్ట్రంలోని చల్లెకిరే పోలీస్ స్టేషన్ పరిధిలోనూ చోరీకి పాల్పడ్డారు. ఈమేరకు వైరా సీఐ నూనావత్ సాగర్‌నాయక్ ఆధ్వర్యాన చేపట్టిన విచారణలో నిందితులు పట్టుబడగా వారి నుంచి బంగారాన్ని రికవరీ చేశారు. అందులో కర్ణాటకలో నమోదైన కేసుకు సంబంధించి 12తులాల బంగారు ఆభరణాలు, కారును చెల్లకిలే ఏఎస్ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ వసంత్‌కుమార్‌కు వైరాలో సీఐ సాగర్ బుధవారం అందజేశారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

ఖమ్మం సిద్ధార్థనగర్‌లో విషాదం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అల్లీపురం రోడ్డులోని సిద్ధార్థనగర్‌లో విద్యుత్ షాక్‌తో బాలిక మృతి చెందింది. కొణిజర్ల మండలానికి చెందిన రాచమళ్ల రాజు – మేరీ దంపతులు అల్లీపురం రోడ్డులోని సిద్ధార్థనగర్ ప్రాంతంలోని ఓ భవనంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె టి.జాస్మిన్(11) బుధవారం ఉదయం ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు స్విచ్ బోర్డును తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరిన ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతురాలి తల్లి మేరీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. కాగా, అంతసేపు కళ్ల ముందు ఆడుతూ తిరిగి కుమార్తె కన్నుమూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఆటో ఢీకొట్టడంతో మహిళ మృతి



సత్యవతి (ఫైల్)

తల్లాడ: తల్లాడ–కొత్తగూడెం రోడ్డులో తల్లాడ మండలం నరసింహారావుపేట వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్తున్న మహిళను వెనక నుంచి ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై మృతి చెందింది. మధిర మండలం జాలిముడికి చెందిన జీడిమెట్ల సత్యవతి(67) అదే గ్రామానికి చెందిన సంగెపు రాములు మోటార్ సైకిల్‌పై జూలూరుపాడు మండలం కాకర్లలోని తన కుమార్తె ఇంటికి బుధవారం వెళ్తోంది. ఈక్రమాన నరసింహారావుపేట వద్ద ఆటో వెనుక నుంచి ఢీకొట్టగా సత్యవతి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే, రాములుకు గాయాలయ్యాయి. సత్యవతి కుమార్తె రాధ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

చింతకాని: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. చింతకాని మండలం పందిళ్లపల్లికి చెందిన కిలారి వెంకట్రావమ్మ(38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల పథ్యాన 19వ తేదీన పురుగుల మందు తాగిన ఆమె కాసేపటికి విషయాన్ని భర్త వెంకటేశ్వరరెడ్డికి చెప్పింది. దీంతో చికిత్స నిమిత్తం ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఘటనపై ఆమె భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి..

ఖమ్మంక్రైం: కదులుతున్న రైలు నుంచి జారిపడడంతో గుర్తు తెలియని వ్యక్తి(25) మృతి చెందాడు. పాపటిపల్లి స్టేషన్ సమీపాన బుధవారం ఆయన మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించగా, ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతున్న హోంగార్డు..

ఖమ్మంక్రైం: పురుగుల మందు తాగిన హోంగార్డు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన సత్తూరి అశోక్(37) ఖమ్మంలో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సారధినగర్ వెళ్లే మార్గంలోని వంతెన వద్ద పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి బంధువులు హైదరాబాద్‌కు తరతలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా, అశోక్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

తల్లాడ మండలం వెంకటగిరికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేల్పుల చిన్నప్ప(60) కుటుంబంతో సహా ఖమ్మం సంభానీ నగర్‌లో నివసిస్తున్నాడు. నగరంలోని రంగనాయకుల వద్ద కొద్దిరోజుల క్రితం సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. అప్పటినుంచి చికిత్స చేయిస్తుండగా ఆయన బుధవారం మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, B.Tech, BAMS, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ BSC (Agree) డిస్టెన్స్ అడ్మిషన్లకై సం.ప్ర. సెల్: 99481 31154 [SCA 25003979]

Wanted

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662 [SCA25003891]

Services

BUSINESS OFFER
■ Need Monthly Returns? Get International Capital Market Trading, Profit sharing / Fixed profit, Safe & Secure.9392151984 [SCA25004032]

BUSINESS SERVICES
■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [H-783415]

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. 9389214214 [H-783416]

www.sakshi.com

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.